సాక్షి
శ్రీకాకుళం

శుక్రవారం : 10 : నవంబర్ : 2023



సర్కారు మంచి మనసు

ప్రభుత్వ బడుల్లో బధిర విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు అందజేయనుంది. పరికరాలు జిల్లాకు చేరుకున్నాయి. - 2లో



అత్తింటి వేధింపులకు..

అత్తింటి వేధింపులకు వివాహిత బలైపోయింది. ఆమె కుమార్తెలు ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. - 2లో

14న ఎచ్చెర్ల ఐటీఐలో అప్రెంటిస్ మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో 14న ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. ఐటీఐలో గురువారం వివరాలు వెల్లడించారు. ఈ మేళాకు 12 పరిశ్రమలు ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే మేళాలకు ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ఐటీఐ శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులు హాజరు కావాలని తెలిపారు. బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, మూడు పాస్‌పోర్టుసైజ్ కలర్ ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.


న్యూస్‌రీల్

నేటి నుంచి బాణసంచా విక్రయాలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో బాణాసంచా విక్రయాలు జరిపేందుకు తాత్కాలిక షాపులకు నేటి నుంచి మూడు రోజుల వరకు అనుమతులు ఇవ్వనున్నట్లు జిల్లా అగ్నిమాపక అధికారి జడ్డు మోహనరావు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పది ఫైర్ స్టేషన్ల పరిధిలో ఉన్న 91 తాత్కాలిక షాపులకు (శ్రీకాకుళం-48, రణస్థలం -12, నరసన్నపేట-07, కోటబొమ్మాళి -5, టెక్కలి -1, పలాస -9, సోంపేట- నిల్, ఇచ్ఛాపురం -1, కొత్తూరు -2, ఆమదాలవలస-0) ఆర్డీవో ద్వారా నిరభ్యంతర పత్రం మంజూరు చేశామని, ఇంకా పెట్టుకోదల్చుకుంటే ఈ నెల 12 వరకు అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో స్టాల్స్ ఉన్నందున అగ్నిమాపక శకటాన్ని మూడు రోజుల పాటు ఉంచనున్నట్లు చెప్పారు.



కల్యాణ వేదిక



సీతారాముల ఉత్సవ విగ్రహాలు



అశేష భక్త జనం

● కల్యాణ వైభోగమే

శ్రీకాకుళం భద్రాచలాన్ని తలపించింది. సీతారాముల కల్యాణ క్రతువుకు వేదికగా మారి మురిసిపోయింది. నారాయణ తిరుమల ఆలయం ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ మైదానం వద్ద గురువారం నిర్వహించిన జానకి రాముల కల్యాణం కమనీయంగా సాగింది. భద్రాచలం, రామతీర్థాలు నుంచి అర్చక స్వాములు వచ్చి క్రతువు చేశారు. రాముడి తరపున వెయ్యి మంది, సీతమ్మ తరపున వెయ్యి మంది దంపతులు పాల్గొన్నారు. అయోధ్య రామాలయానికి చెందిన బంగారు పాదుకలను దర్శించుకున్నారు. - శ్రీకాకుళం కల్చరల్



శ్రీరామ పాదుకలను చూపిస్తున్న పురోహితులు



పొందూరు: మా నమ్మకం నువ్వే జగన్ బోర్డును ఆవిష్కరించిన స్పీకర్ తమ్మినేని సీతారాం

● మంచిని వివరించి..

వై ఏపీ నీడ్స్ జగన్..? ప్రశ్నకు ఊరూరా సవివరంగా సమాధానాలు ఇచ్చారు. గ్రామగ్రామాన పార్టీ జెండాను సగర్వంగా ఎగురవేశారు. రాష్ట్రానికి వైఎస్ జగన్ అవసరం ఎంత ఉందో పల్లెపల్లెకీ విన్నవించారు. సామాన్యుడికి సంక్షేమం అందాలన్నా, పేదవాడి బాధను రూపుమాపాలన్నా అది వైఎస్ జగన్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు. నాలుగున్నరేళ్ల పాలనలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు.



కవిటి: కవిటి సచివాలయంలో అభివృద్ధి సూచికల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ



నరసన్నపేట: పంచాయతీ కార్యాలయం ఎదురుగా బజారు కూడలిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

రంగోయి గ్రామం పరిశీలన



రంగోయి క్రీడా మైదానాన్ని పరిశీలించి చిత్రీకరిస్తున్న ఆర్డీఓ భరత్ నాయక్

కాశీబుగ్గ: పలాస మండలం మామిడిమెట్టు పంచాయతీ రంగోయి గ్రామాన్ని పలాస రెవిన్యూ డివిజనల్ అధికారి భరత్‌నాయక్ గురువారం సందర్శించారు. ఈ నెల 23వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలాసలో కిడ్నీ ఆస్పత్రి, డాక్టర్ వైఎస్సార్ సుజల ధార పథకాన్ని ప్రారంభించనున్నారు. పథకాల పరిశీలనలో భాగంగా పలాస మండలంలో ఉన్న రామకృష్ణాపురం, రంగోయి గ్రామాలను ప్రతిపాదించడంతో వాటిని పరిశీలించి అక్కడి పరిస్థితులను కెమెరాలో బంధించి ఉన్నత అధికారులకు పంపించారు. ఆయనతో పాటు పలాస తహసీల్దార్ లంబాల మధుసూదనరావు తదితరులు ఉన్నారు.

పొలాల్లో పులి జాడలు



మాలపేట గెడ్డ వద్ద పంట పొలాల్లో పెద్ద పులి అడుగులు

టెక్కలి: కంచిలి, పలాస, నందిగాం మండలాల్లో సంచరించిన పెద్దపులి జాడలు ఇప్పుడు టెక్కలి మండలంలో కనిపిస్తున్నాయి. టెక్కలి మండలం గూడేం సమీపంలో గల ఆంధ్రా-ఒడిశా రోడ్డులో మాలపేట గెడ్డకు ఆనుకుని పొలం గట్లపై పెద్దపులి అడుగు జాడలను అధికారులు గుర్తించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గూడేం గ్రామానికి చెందిన తిప్పాన రామయ్య గురువారం ఉదయాన్నే తన పంట పొలాన్ని చూసేందుకు వెళ్లగా, పొలం గట్లపై పెద్ద పెద్ద అడుగులను చూసి భయాందోళనకు గురయ్యారు. దీంతో తన సోదరులు ఆదినారాయణ, నారాయణరావుకు సమాచారం ఇచ్చాడు. దీంతో వారు అటవీ శాఖాధికారులకు సమాచారం అందజేశారు. దీంతో ఫారెస్ట్ రేంజర్ సంజీవ్ నేతృత్వంలో సెక్షన్ అధికారులు రజనీకాంత్, శ్రీనివాసరావు, రామకృష్ణ, యశస్వి, ఉమామహేశ్వరరావు, ఎన్‌జీఓ సిబ్బంది అమర్ తదితరులు గూడేం గ్రామానికి చెందిన రైతులు గుర్తించిన ఆనవాలను పరిశీలించి అవి పెద్ద పులి అడుగులుగా నిర్ధారించారు. పులి పాద ముద్రలను గమనిస్తూ కొంత దూరం వరకు పరిశీలన చేశారు. అనంతరం అటవీశాఖాధికారులు మాట్లాడుతూ.. గూడేం గ్రామానికి ఆనుకుని పంట పొలాల మీదుగా సమీపంలో గల కొండల పైకి పులి చేరుకున్నట్లు అంచనా వేశారు. గూడేం గ్రామం పరిసర గిరిజన గ్రామాలతో పాటు ఆంధ్రా-ఒడిశా రోడ్డు పై రాకపోకలు సాగించే వారంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా పులి ఉన్నట్లు గుర్తిస్తే తక్షణమే తమకు సమాచారం అందజేయాలన్నారు. ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని సూచించారు. అలాగే చీకటి పడిన తర్వాత ఆరుబయట సంచరించవద్దని సూచించారు. పశువులను ఆరుబయట కాకుండా భద్రంగా కట్టాలని సూచించారు. ఎక్కడైనా పులి ఉన్నట్లు అనుమానం వస్తే.. తక్షణమే 6302267557, 9441439721 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

11న ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ ఉత్తరాంధ్ర కార్యవర్గ సమావేశం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ ఉత్తరాంధ్ర జిల్లాల కార్యవర్గ సమావేశం ఈనెల 11వ తేదీన జరగనున్నట్టు ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవల అప్పన్న, కె.నూకరాజు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఇల్లీసిపురంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిరం వేదికగా శనివారం ఉదయం 10 గంటలకు ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ కార్యవర్గ సమావేశ మొదలవుతుందని చెప్పారు. ఈ సమావేశానికి రాష్ట్ర గౌరవాధ్యక్షులు పోతల దుర్గారావు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు, ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులంతా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల పరిశీలన

పాతపట్నం: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం అందించిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు, పనితీరు, నిర్వహణ తీరును రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ టీమ్‌తో పాటు డీఈఓ వెంకటేశ్వరరావు గురువారం తనిఖీ చేశారు. పాతపట్నం మండల కేంద్రంలో ఉన్న అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, బొమ్మిక బాలికల ఆశ్రమ పాఠశాల, విజ్ఞాన్ పాఠశాల ఉన్న ల్యాబ్‌లను గురువారం టాస్క్ ఫోర్స్‌టీమ్, జిల్లా సైన్స్ అధికారి ఎస్.కుమారస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా టాస్క్ టీం వి.రమణ మాట్లాడుతూ జిల్లాలో 23 ల్యాబ్‌లు ఉన్నాయని, వాటి పనితీరు, రికార్డులు, విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు పరిశీలించామన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నిర్వహణ ఏ విధంగా ఉంటుందనే విషయాలను ప్రధానోపాధ్యాయులకు వివరించినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ కృష్ణతార, పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐఎస్‌డీపీ ఏడీ సస్పెన్షన్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా పశుసంవర్ధకశాఖ పరిధిలో ఐఎస్‌డీపీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పి.సూర్యంను క్రమశిక్షణ చర్యలకింద సస్పెండ్‌చేస్తూ పశుసంవర్ధకశాఖ రాష్ట్ర డైరెక్టర్ ఆర్.అమరేంద్రకుమార్ ఈ నెల 8వ తేదీన ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా పశుసంవర్ధకశాఖ వీఏఎస్, ఏడీలు 39మంది గత నెల 28న డైరెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఏడీ సూర్యంపై ఈ నెల ప్రాథమిక విచారణ జరిపి క్రమశిక్షణ చర్యలు కింద సస్పెండ్‌చేసినట్లు ఉత్తర్వులు జారీచేశారు.

'నాణ్యత పాటించాలి'



పాఠశాలలో పులిహోర రుచి చూస్తున్న కాంతారావు

పాతపట్నం: పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు హెచ్చరించారు. పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన గురువారం మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. పులిహోరలో పులుపు లేదని, విద్యార్థులకు భోజనం ఇలా పెడితే తినగలరా అని ఇన్‌చార్జి హెచ్‌ఎం సుజాతను, వంట వండే మహిళలను నిలదీశారు. విద్యార్థులకు పెట్టే భోజనం రుచికరంగా ఉండాలన్నారు. అంగన్‌వాడీలో చిన్నా రులకు అందించే పౌష్టికాహారాన్ని కూడా అంగన్‌వాడీ సిబ్బంది సక్రమంగా అందించాలన్నారు. పాతపట్నంలో సులిగాలి పర్యటన చేశారు.

సివిల్ సప్లయిస్ గోడౌన్ పరిశీలన

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని సివిల్ సప్లయి గోడౌన్‌ను రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 29 బియ్యం బస్తాల అదనంగా ఉన్నట్లు గుర్తించారు. 23 బస్తాలు పాతపట్నం జీసీసీ డిపోకి ఇవ్వాల్సి ఉందని సిబ్బంది తెలియజేశారు. అయినప్పటికీ 6 బస్తాలు అధికంగా నిల్వ ఉన్నట్లు గుర్తించారు. కందిపప్పు, నూనె, పంచదార నిల్వలను పరిశీలించారు. ఆర్వో లేకుండా బియ్యం పంపిణీ చేస్తున్నట్లు గుర్తించారు. దీనిపై సివిల్ సప్లయి జిల్లా మేనేజర్, జాయింట్ కలెక్టర్లకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

రోగి బంధువుల ఆందోళన

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలులో గల ఓ ప్రైవేట్ మెడికల్ కళాశాల ఆస్పత్రిలో రోగి బంధువులు గురువారం రాత్రి ఆందోళనకు దిగారు. పూర్తి వివరాల్లోకి వెళితే పోలాకి మండలం రాళ్లగోదయ్యవలసకు చెందిన పిల్లల పున్నయ్య (31) ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే బంధువులు శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. బ్రెయిన్‌లో రక్తం గడ్డ కట్టడంతో వైజాగ్ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఎంపీకి చెందిన దగ్గరి బంధువు ఈ ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యానికి రిక్వెస్ట్ చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో స్థానిక వైద్యులు క్షతగాత్రుడిని చేర్పించుకున్నారు. చికిత్స అనంతరం రోగిని ఈనెల 6న జనరల్ వార్డుకి షిఫ్ట్ చేశారు. అప్పటికే ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో వెంటనే వైద్యులు మెదడుకు ఆపరేషన్ చేశారు. అయినప్పటికీ పేషెంట్ కోలుకోకపోవడంతో ఆయన వెంటిలేటర్‌పై ఉంచారు. దీంతో రోగి బంధువులు వైద్యం సరిగా అందలేదని ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

సర్కారు మంచి మనసు



శ్రీకాకుళం భవిత కేంద్రం

- దృష్టి, వినికిడి లోపం ఉన్నవారికి సర్కారు బాసట
- లెనోవా, శాంసంగ్ ట్యాబ్‌ల అందజేతకు నిర్ణయం
- జిల్లాకు చేరుకున్న 241 ట్యాబ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ.. దృష్టి లోపం, వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు రాష్ట్రప్రభుత్వం శుభవార్త చెప్పింది. వీరికి ట్యాబ్‌లను పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇందుకు సమగ్రశిక్షణ చర్యలు తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో లెనోవా, శాంసంగ్ ట్యాబ్‌లను పంపిణీ చేయాలని భావించింది.

జిల్లాకు చేరుకున్న 241 ట్యాబ్‌లు..

ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లు కలిగిన 241 ట్యాబ్‌లు స్టేట్ ప్రాజెక్ట్ సమగ్రశిక్ష కార్యాలయం నుంచి జిల్లాకు చేరుకున్నాయి. ఇందులో 80 భవిత కేంద్రాల్లో టీచర్లకు అందజేయనుండగా, మిగిలిన 161 ట్యాబ్‌లను దృష్టిలోపం, వినికిడి లోపం ఉన్నవారికి అందజయనున్నారు.

అర్హులు ఎవరంటే..?

ప్రభుత్వ పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి చదువుతూ దృష్టిలోపం/వినికిడి లోపం ఉన్న విద్యార్థులు, అలాగే 7 నుంచి 10వ తరగతి చదువుతు వినికిడి లోపం ఉన్నవారు ట్యాబ్‌లు అందుకోవడానికి అర్హులు. ఈ రెండు కేటగిరీల కలిగిన విద్యార్థులు సదరం సర్టిఫికెట్ కలిగి ఉండాల్సి ఉంటుంది. అయితే వీరిలో ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులలో గత ఏడాది బైజూస్ ట్యాబ్‌లు తీసుకున్న విద్యార్థులు అనర్హులని జిల్లా సమగ్రశిక్ష అధికారులు వివరించారు.

భవిత కేంద్రాలను సంప్రదించాలి



దృష్టి, వినికిడి లోపం కలిగి.. అర్హత కలిగిన దివ్యాంగ విద్యార్థులు వారి వారి మండలాల్లో గల భవిత కేంద్రాన్ని సంప్రదించాలి. సదరం సర్టిఫికెట్‌ను సిద్ధం చేసుకోవాలి. అనంతరం అర్హులైన దివ్యాంగులకు కలెక్టర్ చేతులమీదుగా ట్యాబ్‌లను పంపిణీచేస్తాం.

– డాక్టర్ రోణంకి జయప్రకాష్, ఏపీసీ సమగ్రశిక్ష శ్రీకాకుళం

చట్టం ముందు అంతా సమానమే

- జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: చట్టం ముందు పౌరులంతా సమానమేనని, పేదరికంతో న్యాయ సహాయం పొందలేని వారు న్యాయ సేవాధికార సంస్థ సేవలు వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టులోని న్యాయ సేవ సదన్‌లో గురువారం నిర్వహించిన లీగల్ సర్వీసెస్ డేకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకుముందు న్యాయమూర్తులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థ సేవలు చాలా విలువైనవని, పరిష్కారమే దొరకదనుకున్న ఎన్నో సమస్యలు పరిష్కారమైన దాఖలాలు ఉన్నాయని వివరించారు. న్యాయ సేవలకే పరిమితం కాకుండా ఉచిత వైద్య క్యాంపులు, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు లాంటి కార్యక్రమాలు నిర్వహించి ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 53 మెగా లోక్ అదాలత్ లు నిర్వహించామని, 33,498 పెండింగ్ కేసులను పరిష్కరించామని పేర్కొన్నారు. జిల్లాలో 653 లీగల్ లిటరసీ క్యాంపులు నిర్వహించామని, 18 చోట్ల వైద్య శిబిరాలు, బ్రదర్ హుడ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ లాంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు కె.శ్రీదేవి, పి.భాస్కరరావు, ఎస్.మహేంద్ర ఫణి కుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అనురాధ, మేజిస్ట్రేట్ శ్రీవిద్య, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, ఏఎస్పీ తిప్పే స్వామి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మెట్ట మల్లేశ్వర రావు, లోక్ అదాలత్ చైర్మన్ జ్ఞాన సువర్ణ రాజు, స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ గేదెల వాసుదేవరావు, సాంఘిక సంస్కర్త మంత్రి వెంకట స్వామి ఎంపీ ఆర్ లా కాలేజీ ప్రిన్సిపల్ కే.మోషే తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ దారుల సమస్యల పరిష్కారానికి సమావేశం

శ్రీకాకుళం పాత బస్టాండ్: పింఛన్‌దారుల సమస్యల పరిష్కారం కోసం కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించనున్నట్లు ఖజానా శాఖ డీడీ సీహెచ్ రవికుమార్ తెలిపారు. ఈ నెల 14వ తేదీన పింఛనుదారుల సమస్యలపై పింఛన్‌దారులు, పింఛన్ దారుల సంఘాలతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశం జిల్లా ఖజానా కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరుగుతుందని తెలిపారు. పింఛను దారులు వారి సమస్యలు విన్నవించుకోవాలని సూచించారు.

పాన్‌షాపు దగ్ధం



పాతపట్నంలో అగ్నికి దగ్ధమైన పాన్‌షాప్

పాతపట్నం: పాతపట్నం ఆల్‌ఆంధ్ర రోడ్డు సమీపంలో గురువారం రాత్రి 9 గంటల సమయంలో కె.మోహనరావుకు చెందిన పాన్‌షాప్ అగ్నికి ఆహుతైపోయింది. గురువారం రాత్రి 8 గంటల సమయంలో మోహనరావు షాపు మూసివేసి, ఇంటికి వెళ్లిపోయారు. 8.30 సమయంలో షాప్ నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో ఇరుగుపొరుగువారు మోహనరావుకు తెలియజేసి, మంటలను అదుపుచేశారు. ఆస్తి నష్టం రూ.50 వేలు ఉంటుందని అంటున్నారు. ఫ్రిజ్‌తో పాటు దుకాణంలోని వస్తువులు కాలిపోయాయి. సంఘటన స్థలానికి వీఆర్‌ఓ రోజా రమణి చేరుకుని, బాధితుడి నుంచి వివరాలు తెలుసుకున్నారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా



సమావేశానికి హాజరైన అధికారులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర నేరాలకు పాల్పడిన వారిపై షీట్ ఓపెన్ చేయాలని, రౌడీషీటర్లపై ప్రత్యేకమైన నిఘా ఉంచాలని ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. ఆమె గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలో నమోదైన నేరాలపై పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తీవ్రమైన నేరాలు, దర్యాప్తు, పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులు, రౌడీషీటర్లపై ఉన్న దర్యాప్తు కేసులు, నాన్ బెయిల్‌బుల్‌లతో పాటుగా ముఖ్య నేరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ కోర్టులో చార్జిషీటు దాఖలు చేసి నిశితమైన ఆధారాలతో ముద్దాయిలకు శిక్ష పడేలా కేసుల దర్యాప్తులు చేయాలని అన్నారు. ప్రతి కేసులో ఏదో ఒక చిన్న ఆధారం ఉంటుందని, అదే మనకు ఆయుధమని, ఎంతటి కేసునైనా ఛేదించవచ్చన్నారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. సమావేశంలో అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు వై.శృతి, జి.బాలచంద్రరెడ్డి, డి.నాగేశ్వరరావు, కె.బాలరాజు, విజయ్‌కుమార్, ఎస్.వాసుదేవరావు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై తనిఖీలు

శ్రీకాకుళం క్రైమ్: గంజాయి, గుట్కా , నాటుసారా, మద్యం అక్రమ రవాణాపై అధికారులు చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉంటూ విస్తృత తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ జీఆర్‌రాధిక అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో ఎస్పీ అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ విద్యాసంస్థల పరిధిలో గంజాయి, గుట్కా, పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి విద్యార్థులకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఇసుక రవాణా సమయంలో ఎలాంటి బిల్లులు లేకుంటే నమోదు చేయాలని, మద్యం అక్రమ అమ్మకాలను గుర్తించి రైడ్స్ నిర్వహించాలని తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టి డ్రైవర్ మృతి



పైడిభీమవరం ప్రమాదానికి గురైన లారీ

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టి మరో లారీ డ్రైవర్ తాల్లూరి రమేష్ బాబు (49) మృతి చెందారు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పైడిభీమవరం జాతీయ రహదారిపై ఏపిటోరియా పరిశ్రమ ఎదుట ఓ లారీ టైర్ పేలిపోయి ఆగిపోయి ఉంది. ఈ లారీని ఒడిశా నుంచి ఏలూరు వెళ్తున్న లారీ గురువారం తెల్లవారుజామున ఢీకొట్టింది. దీంతో ఆ లారీ డ్రైవర్ కమ్ ఓనర్ తాల్లూరి రమేష్ బాబుకు తీవ్రగాయాలయ్యాయి. అక్కడున్న వారు విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా దారిలోనే చనిపోయారు. మృతుడి స్వగ్రామం ఎన్టీఆర్ జిల్లా అక్కపాలెం. అతని సోదరుడు రవిభూషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్కుకు ప్రోత్సాహకాలు

విశాఖ విద్య: విజయనగరం జిల్లా ఎస్.కోట మండలంలోని జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రీయల్ పార్కు లిమిటెడ్‌కు పలు రాయితీలను ప్రకటిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంఎస్‌ఎంఈ పార్కులో అల్యూమినియం రిఫనరీ కాంప్లెక్స్ ఏర్పాటు ద్వారా ఈ ప్రాంత యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేలా సంస్థ ముందుకొచ్చింది. రూ.531.36 కోట్లు పెట్టుబడితో 1,166 ఎకరాల్లో ఐదేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేసేలా ప్రభుత్వం ఇది వరకే అనుమతులు ఇచ్చింది. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా, ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడేలా పెద్దమొత్తంలో పెట్టుబడితో ప్రాజెక్టు నిర్వహణకు ముందుకొచ్చిన నేపథ్యంలో దీన్ని ప్రోత్సహించేలా ఇండస్ట్రీయల్ డవలెప్‌మెంట్ -2023-37 పాలసీ మేరకు రాయితీలను ఇచ్చేలా స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు(ఎస్‌ఐపీబీ) ఆమోదం తెలిపి, ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను ప్రభుత్వానికి నివేదించింది. వీటిలో కొన్నింటికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇండస్ట్రీయల్ పార్కు వరకు విద్యుత్, నీటి సరఫరాకు అనుమతి ఇస్తూ, ఇందుకు సంబంధించిన వ్యయాన్ని సంస్థ వెచ్చించాలని సూచించింది. 33 శాతం మించకుండా రెసిడెన్షియల్/కమర్షియల్ నిర్మాణాలు చేసుకునేలా, అదే విధంగా ఐడీపీ 2023-37 పాలసీ మేరకు ఇతర ప్రోత్సాహకాలు వినియోగించుకునేలా వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

'నితీశ్ క్షమాపణ చెప్పాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: మహిళల పట్ల అసభ్య పదజాలం వాడి కించపరిచిన బీహార్ సీఎం నితీశ్ కుమార్ వెంటనే దేశంలోని మహిళలకు బహిరంగంగా క్షమాపణ చెప్పడంతోపాటు రాజీనామా చేయాలని మహిళా మోర్చా జిల్లా బీజేపీ అధ్యక్షురాలు మంగి లక్ష్మిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం నగరంలోని సూర్యమహల్ జంక్షన్‌లో ఉన్న స్వామి వివేకానంద విగ్రహం వద్ద ధర్నా చేశారు.

విజయ్ హజారే టోర్నీకి 'విజయ్'



క్రికెట్ స్టేడియంలో బ్యాటింగ్ చేస్తున్న విజయ్

శ్రీకాకుళం న్యూకాలనీ: బీసీసీఐ ఆధ్వర్యంలో జరిగే ప్రతిష్టాత్మక విజయ్ హజారే క్రికెట్ టోర్నీకి శ్రీకాకుళం స్టార్ ఆటగాడు త్రిపురాన విజయ్ ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నుంచి వర్తమానం అందింది. ఈ నెల 23తేదీ నుంచి డిసెంబర్ 3 వరకు చండీగఢ్ వేదికగా జరగనున్న సీనియర్ పురుషుల విజయ్ హజారే అంతర్ రాష్ట్ర వన్డే క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రా జట్టుకు టెక్కలికి చెందిన యువ క్రికెటర్ త్రిపురాన విజయ్ ఎంపికయ్యాడు. టాపార్డర్ బ్యాటింగ్‌తోపాటు ఆఫ్ స్పిన్ బౌలింగ్‌తో స్టార్ ఆల్‌రౌండర్‌గా ఇప్పటికే గుర్తింపు పొందిన విజయ్.. ఇటీవలి జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీ వేదిక జరిగిన సీనియర్ మెన్స్ సయ్యద్ ముస్తాక్ అలీ అంతరాష్ట్ర టి-20 క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించి అత్యుత్తమ ప్రదర్శనతో రాణించాడు.

ఐపీఎల్ సెలక్షన్ ట్రైల్స్‌లో పాల్గొని..

అంతకుముందు ఏపీఎల్ సీజన్-2తోపాటు సయ్యద్ ముస్తాక్ ఆలీ క్రికెట్ టోర్నీలో ఆకట్టుకోవడంతో ఇండియన్ ప్రీమియం లీగ్(ఐపీఎల్) ఫ్రాంచైజీలు ముంబై ఇండియన్స్, కింగ్స్ ఎలెవన్ పంజాబ్‌ల నుంచి పిలుపు వచ్చింది. ఆయా యాజమాన్యాల పిలుపు మేరకు ముంబై, చండీగఢ్‌లో నిర్వహించిన సెలక్షన్ ట్రైల్స్‌లో సైతం పాల్గొని సత్తాచాటాడు. విజయ హజారే వన్డే ట్రోఫీలో పాల్గొనే ఆంధ్రా జట్టుకు శ్రీకాకుళం జిల్లా నుంచి మరోసారి ఒకే ఒక్కడు ఎంపికయ్యాడు.

టెక్కలి నుంచి జాతీయస్థాయికి..

టెక్కలిలోని అయ్యప్పనగర్ కాలనీలో నివాసం ఉంటున్న త్రిపురాన వెంకట కృష్ణంరాజు, లావణ్య దంపతులు కుమారుడు విజయ్. తండ్రి సమాచారశాఖలో ఉద్యోగిగా పనిచేస్తుండగా, తల్లి గృహిణి. బీసీసీఐ నిర్వహించే జాతీయస్థాయి అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నీకి జిల్లా నుంచి త్రిపురాన విజయ్ ఎంపిక కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. విజయ్ ఎంపికపై జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీవైఎన్ శాస్త్రి, హసన్‌రాజా షేక్ లు, ఇలియాస్ మహమ్మద్, రవికుమార్, శైలానీ, సంఘ ప్రతినిధులు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

ప్రజా ప్రాయోజిత సేవలపై అవగాహన



మాట్లాడుతున్న లోక్ అదాలత్ చైర్మన్ జ్ఞాన సువర్ణరాజు

శ్రీకాకుళం రూరల్: ప్రజా ప్రాయోజిత సేవలపై ప్రతి ఉద్యోగి అవగాహన కలిగి ఉండాలని లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞాన సువర్ణరాజు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధిరి బొడ్డేపల్లి మీనాక్షి అధ్యక్షతన గురువారం ఆ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు శాశ్వత లోక్ అదాలత్ ద్వారా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ కేసులు, ప్రి లిటిగేషన్ కేసులు, ప్రజాప్రయోజన సేవలను పరిష్కరించుకోవచ్చని సూచించారు. దీనికి ఎలాంటి ఫీజును చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు మానవ అక్రమ రవాణాకు గురైనవారికి, ప్రకృతి వైపరీత్యాల ద్వారా నష్టం కలిగిన వారు కుడా లోక్‌అదాలత్ సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ అనురాధ, జిల్లా మాస్‌మీడియా అధికారి పైడి వెంకటరమణ, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

'కాళీపట్నం' చూడర బాబూ



సభలో మాట్లాడుతున్న అట్టాడ అప్పలనాయుడు

శ్రీకాకుళం కల్చరల్: కాళీపట్నం రామారావు మాస్టారి రచనల కృషి, వ్యక్తిత్వాన్ని తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని శ్రీకాకుళ సాహితీ కార్యదర్శి అట్టాడ అప్పలనాయుడు అన్నారు. స్థానిక కథానిలయంలో కారా మాస్టారు శతజయంతి ప్రారంభ సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో సభ నిర్వహించాలని సూచించారు. గంటేడ గౌరునాయుడు మాట్లాడుతూ సమాజ రుణం తీర్చుకునేందుకు సాహిత్యం ఒక పరికరంగా మాస్టారు భావించి నిరూపించారని అన్నారు. కథానిలయం ప్రతినిధి కేవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఒక నది ప్రయాణం చేసిన మేర సస్యశ్యామలం చేసినట్లు వ్యక్తులు తమ జీవన ప్రయాణంలో ఉపయుక్తులుగా ఉండాలని మాస్టారు ఎప్పుడూ అంటారని అన్నారు. శతజయంతి సంచిక తేవాలని, ముగింపు సభ పెద్ద ఎత్తున జరగాలని ప్రముఖ నాటక రచయిత దీర్ఘాసి విజయభాస్కర్ సందేశాన్ని పంపారు. అరసం అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావు మాట్లాడుతూ ఆయన నడత, కథా నడక గొప్ప అమూల్యమైన సంపద అని అన్నారు. కార్యక్రమంలో పి.భోగారావు, ఎస్.స్వామినాయుడు, పిఎస్ నాగరాజు, దాసరి రామచంద్రరావు, సీహెచ్ తిరుమలరావు, కె.దాసుబాబు, శ్రీనివాస్, రచయిత్రి భారవి, రామినాయుడు, జి.రంగనాథం, బి.రంగారావు, సీహెచ్ రామచంద్రరావు, పండా శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి

- పురుగు మందు సేవించిన తల్లీకూతుళ్లు
- చికిత్స పొందుతూ తల్లి సుజాత మృతి, కూతుళ్ల పరిస్థితి విషమం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



పేడాడ శ్రీనివాసరావు కుటుంబసభ్యులు

ఆమదాలవలస రూరల్: వరకట్న పిశాచి మరో కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసింది. అదనపు కట్నం వేధింపులకు మరో వివాహిత బలైపోయింది. ఆమెతో పాటు ఇద్దరు పిల్లలు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అక్కులపేట గ్రామానికి చెందిన పేడాడ సుజాత (33) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. బిడ్డలు కూడా పురుగు మందు తాగేయడంతో వారు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే..

అక్కులపేట గ్రామానికి చెందిన పేడాడ శ్రీనివాసరావు, ఆమదాలవలస మున్సిపాలిటీ జగ్గుశాస్త్రులపేట గ్రామానికి చెందిన సుజాతకు 15 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి మౌనిక (14), మహేశ్వరి (12) ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె మౌనిక 9వ తరగతి, చిన్న కుమార్తె మహేశ్వరి 7వ తరగతి స్వగ్రామం అక్కులపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. సుజాతకు వివాహం జరిగినప్పటి నుంచి సంతోషంగా ఉన్నా.. ఆ తర్వాత ఆస్తి గొడవలు ప్రారంభమయ్యాయి. అదనపు కట్నం తీసుకురావాలని సుజాతను భర్త శ్రీనివాసరావుతో పాటు కుటుంబ సభ్యులు వేధింపులకు గురి చేయడం మొదలుపెట్టారు. కన్నవారి ఇంటి నుంచి అదనపు కట్నం కింద భూమి తీసుకురావాలని ప్రతి రోజూ వేధించేవారు. దీంతో గత ఆదివారం రాత్రి సుజాత తాను పురుగు మందు తాగేయడమే కాకుండా ఆమె కుమార్తెల చేత కూడా తాగించారు. కుటుంబ సభ్యులు దీన్ని గమనించి వారిని శ్రీకాకుళం రిమ్స్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నందున ఐసీయూలో చికిత్స పొందుతున్న సుజాత బుధవారం మృతిచెందడంతో ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఐసీయూలో చికిత్స పొందుతున్న కుమార్తెలు ఇద్దరి పరిస్థితి ప్రస్తుతానికి విషమంగా ఉందని కుటుంబసభ్యులు చెబుతున్నారు.

అదనపు కట్నం కోసం నిత్యం శ్రీనివాసరావు వేధింపులు గురి చేస్తూ సుజాతను చిత్రహింసలకు గురిచేసేవాడని సుజాత తల్లి సత్యవతి ఆరోపిస్తున్నారు. భర్త, వారి కుటుంబసభ్యుల వేధింపులు తట్టుకోలేకే సుజాత ఈ అఘాయిత్యానికి పాల్పడిందని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై రిమ్స్ అవుట్ పోస్టులో కేసు నమోదు చేయగా ఆమదాలవలస పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దీనికి కారకులైన సుజాత భర్త శ్రీనివాసరావు, మామ వెంకటరావు, మరిది శ్యామలరావుని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ రఘునాథ్ తెలిపారు.